
రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ డా. లక్ష్మణ్

మాస్ ఫాలోయింగ్ పార్టీ బీజేపీ

చిక్కడపల్లి, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మాస్ ఫాలోయింగ్ ఉన్న పార్టీ బీజేపీ అని ఎంపీ డా. కె. లక్ష్మణ్ అన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం సికింద్రాబాద్ మహాకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో గురువారం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్వాడా పేరిట ప్రజలకు సేవలు అందించాలని బీజేపీ నిర్ణయించిందన్నారు. ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్నారనీ, ఇలాంటి విధానాలు బీజేపీకి సరిపడవన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్, కవాడిగూడ కార్పొరేటర్లు ఎ. పావనివినయ్‌కుమార్, రచనశ్రీ, పార్టీ నాయకులు వినయ్‌కుమార్, పూస రాజు, రమేష్ రామ్, భరత్‌గౌడ్, వెంకటేశ్, పరిమళ్‌కుమార్, నలంద్రిశ్రీనివాస్‌యాదవ్, రత్నసాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

- చర్యలు తీసుకోవాలంటూ టీఆర్‌టీ కాలనీ వాసుల నిరసన

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌టీ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. గురువారం నిర్మాణం వద్ద కాలనీవాసులు తగరం అనిల్, విఠల్, శైలేష్, కె.రాము, బాచి, శ్రీనివాస్, కుమార్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణంపై హైడ్రా, జీహెచ్‌ఎంసీ విజిలెన్స్, కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. నిర్మాణంపై అధికారులు స్పందించకపోతే జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి'

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్‌కుమార్ గౌడ్ తెలిపారు. త్వరలోనే పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీల నియామకాలు జరుగుతాయని చెప్పారు. గురువారం పార్టీ నగర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నగరంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం టీడీపీ నేతలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్, జి.యాదగిరిరావు, పెద్దోజు రవీంద్రాచారి, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలను స్వాగతిస్తున్నాం : టీడీపీ

నల్లకుంట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలను స్వాగతిస్తున్నామని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె. దశరథ్ అన్నారు. గురువారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చు తగ్గుతుందన్నారు.

'కమలానెహ్రూనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి'

ముషీరాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కమలానెహ్రూనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం నవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం కాలనీలో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్‌తో కలిసి సందర్శించారు. కొత్త పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

25న 'చలో ఢిల్లీ'

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న రైతు సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తుమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ తెలిపారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద చలో ఢిల్లీ, ధర్నా కార్యక్రమానికి సంబంధించి తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, ఎం. శోభన్, ఎల్. బాలకృష్ణప్రసాద్, పి. ఆశయ్య, సాంబశివ, ఆర్. శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న సుద్దాల అశోక్‌తేజ, మంజుభార్గవి తదితరులు

తెలుగు ప్రేక్షకుల గుండెల్లో కలకాలం నిలిచే నటుడు అక్కినేని

చిక్కడపల్లి, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రేక్షకుల గుండెల్లో కలకాలం నిలిచే నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని ప్రముఖ గీతరచయిత డా. సుద్దాల అశోక్‌తేజ అన్నారు. అభినందన, సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి వేడుకలు గురువారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తనలోని లోపాలను తెలుసుకుని తనను తాను చెక్కుకున్ననటుడు అక్కినేని అని అన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న నాట్యగురువు మంజు భార్గవిని నాట్యశాస్త్రం బొమ్మ అయితే అది మంజుభార్గవి అవుతుందని అభివర్ణించారు. తిరుమల గ్రూపు చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, సంజయ్‌కిషోర్, రేలంగి నరసింహారావు, డా. కేవీ కృష్ణకుమారి, పొన్నాడ మోహన్‌రావు, శ్రీమణి, అభినందన భవానీ పాల్గొన్నారు.

నాన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ అభ్యర్థులకు
వెయిటేజీ మార్కులు కలపాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మెడికల్ హెల్త్ స్టేట్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఇటీవల విడుదల చేసిన నర్సింగ్ ఆఫీసర్స్ నోటిఫికేషన్‌లో నాన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ అభ్యర్థులకు అకడమిక్ వెయిటేజీ ప్రతి సంవత్సరానికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా పది మార్కులు కలపాలని నర్సింగ్ సమితి డిమాండ్ చేసింది. సమితి అధ్యక్షుడు గోవర్ధన్, నాయకుడు వెంకి నాని గురువారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అకడమిక్ వెయిటేజీ మార్కులు ఇచ్చేవారని, 2023 సంవత్సరం నుంచి ఎత్తివేశారన్నారు. దీంతో ప్రైవేట్ సెక్టార్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారు నష్టపోతున్నారన్నారు. నాన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నర్సింగ్ అభ్యర్థుల సేవలను దృష్టిలో ఉంచుకొని వెయిటేజీ మార్కులను కలపాలని కోరారు. పరీక్షను మూడు షిఫ్టుల్లో కాకుండా ఒకే షిఫ్టులో నిర్వహించాలని, పాస్ మార్కులను నిర్ణయించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో శ్యామ్, లక్ష్మీ, ప్రశాంతి ఉన్నారు.

టీయూడబ్ల్యూజే హెల్త్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



టీయూడబ్ల్యూజే హెల్త్ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్.శ్రీనివాస్ నియమితులయ్యారు. హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్ శ్రీనివాస్‌ను గురువారం సత్కరించారు. హెచ్‌యూజే ఉపాధ్యక్షుడు జె. పుండరీచారి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేశపాక స్వామి, పాత్రికేయులు ఉపేందర్, విజయ్, మల్లేష్, గిరి, దయానంద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

అంబర్‌పేట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త శాంతి సామరస్యాలను బోధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు మహేష్ ముదిరాజ్, కార్యక్రమ నిర్వాహకులు షానూర్, తనీర్, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

ముషీరాబాద్: మిలాద్ ఉన్ నబీ పండగను భోలక్‌పూర్‌లో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నదానం చేసి షర్బత్ పంపిణీ చేశారు. బైక్ ర్యాలీని ఉద్దేశించి బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త బోధనలను అనుసరిస్తూ శాంతియుతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు మహ్మద్ అలీ, రహీం, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మత పెద్దలను జైసింహ, భోలక్‌పూర్ కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ సన్మానించారు. భోలక్‌పూర్ నుంచి నిర్వహించిన ర్యాలీకి ముషీరాబాద్ చౌరస్తాలో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్ యాదవ్ స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్, ఎంఐఎం పార్టీ నాయకుడు షరీఫ్ పోలీసులను సన్మానించారు. కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, ముషీరాబాద్ సీఐ జి. రాంబాబు, డీఐ నదీం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రాంనగర్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అంబర్‌పేట రత్నానగర్‌లో మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిరెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



ముషీరాబాద్‌లో ముస్లింల ర్యాలీ, రత్నానగర్‌లో అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి

నిజాం రాచరికంపై పోరాటం చేసింది కమ్యూనిస్టులే


మగ్దుం మొయినుద్దీన్‌కు నివాళులర్పిస్తున్న ఎస్. వీరయ్య తదితరులు

కవాడిగూడ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనపై పోరాటం చేసింది కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. వీరయ్య పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వార్షికోత్సవాల సందర్భంగా గురువారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న మగ్దుం మొయినుద్దీన్ విగ్రహం వద్ద నుంచి బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ట్యాంక్‌బండ్‌పైగల మగ్దుం మొయినుద్దీన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. నిజాం వ్యతిరేక పోరాటంలో ఎటువంటి భాగస్వామ్యం లేని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు రాజకీయ ప్రయోజనాలకోసం మతవిద్వేశాలను రెచ్చగొట్టే చర్యలు ప్రమాదకరమని అన్నారు.

బైక్ ర్యాలీలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీజీ నర్సింహారావు, నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం. వెంకటేష్, ఎం. మహేందర్, ఎం. దశరథ్, రాజన్న, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చారిత్రాత్మకం

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చారిత్రాత్మకమని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా సాయుధ పోరాటాలతో కూడిన చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. చిత్రప్రదర్శనలో నాటి పోరాట ఘట్టాలను ఆయన తిలకించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ పోరాటంలో నాలుగు వేల మంది అమరులయ్యారని తెలిపారు. చాకలి ఐలమ్మ, భీంరెడ్డి, దొడ్డి కొమురయ్య చేసిన భూపోరాటం ఫలితంగా దున్నేవారికి భూమి హక్కు వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి వినయ్‌కుమార్, నాయకులు మహేందర్, రాములు, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఆరోగ్యమిత్రలు

వేతనాలు పెంచాలంటూ ఆరోగ్య మిత్రల నిరసన

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రల సమ్మెకు సీఐటీయూ తెలంగాణ యునైటెడ్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఫసియుద్దీన్, కె. యాదానాయక్ మద్దతు తెలిపారు. వేతనాలు పెంచాలంటూ ఆరోగ్య మిత్రలు గురువారం గోల్కొండ చౌరస్తాలో నిరసన ప్రదర్శ నిర్వహించారు. జీవో 60 ప్రకారం వేతనాలను రూ. 22,750కి పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేష్, నాయకులు భూపాల్, రాజు, రత్నం, కుమారస్వామి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితమై హక్కులను సాధించుకోవాలి

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పద్మశాలీలందరూ సంఘటితమై తమ హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్సీ రమణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో అక్టోబర్ 20న హరిణి వనస్థలి అనన్య ఎకో పార్కు ఆవరణలో జరిగే పద్మశాలీల దసరా మేళా బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పద్మశాలీలు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం ఎల్.బి.నగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, మేళా కమిటీ చైర్మన్ కౌకుంట్ల రవితేజ, సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచందర్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల తదితరులు పాల్గొన్నారు.


పద్మశాలీల దసరా మేళా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రమణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ తదితరులు


మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బస్తీల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలి

గోల్నాక, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు బస్తీల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం గోల్నాక పెరల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జేజే మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్‌క్యాంపును ఆయన ప్రారంభించారు. రక్తదాన శిబిరం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జేజే మెమోరియల్ మెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో జేజే మెమోరియల్ ప్రతినిధులు, స్థానిక నాయకలు, వైద్యులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

హైడ్రా పేరుతో పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోం

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణం, చెరువులు, నాలాలు, పార్కులను కాపాడాలనే పేరుతో హైడ్రా పేదలను రోడ్డున పడేస్తే ఊరుకోం అని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హెచ్చరించారు. పేదల ఆస్తులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే కట్టడాలను కూల్చాలన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైడ్రా కూల్చివేతలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. హైడ్రా పేరుతో అక్రమాలు చేస్తే ఊరుకోబోమన్నారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి. నాగయ్య, ఆర్. వెంకట్రాములు, నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో చైన్‌స్నాచింగ్

అంబర్‌పేట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసును చైన్ స్నాచర్లు లాక్కొని పారిపోయారు. ఛే నబర్ రామాలయం సమీపంలో నివసిస్తున్న ఎం. పుష్పలత(34) గురువారం సాయంత్రం కుమార్తెను ఆడిస్తోంది. అదే సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసు తెంపుకుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం చర్యలు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ లింబాద్రి

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా శాఖలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉన్నత విద్యా కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు జి. వెంకటస్వామి ఆశయంతో ముందుకు సాగాలని సూచించారు. అంబేడ్కర్ కళాశాలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చదివి ఉన్నత శిఖరాలకు ఎదగడం అభినందనీయమన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ మట్ట శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఇద్దరి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో రైళ్లు ఢీకొని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతిచెందారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఫలక్‌నూమ - బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య 45 ఏళ్ల వయస్సుగల వ్యక్తి పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న ఎల్లంక - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో సంఘటనలో.. శివరాంపల్లి-బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య 30 ఏళ్ల వయస్సుగల వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. రెండు కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి ప్రతిరూపం 'సురవరం'


మాట్లాడుతున్న నరసింహారెడ్డి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి ప్రతిరూపం సురవరం ప్రతాపరెడ్డి అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆయన అందరి అభిమానం పొందారన్నారు. గురువారం రాత్రి గానసభలో పత్రికారచయిత, సాహితీవేత్త సురవరం ప్రతాపరెడ్డి సంస్మరణ సమావేశం జరిగింది. సాహితీవేత్త రమణ వెలమకన్ని సురవరం ప్రతాపరెడ్డి జీవిత విశేషాలను వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, గాయని సీతాదేవి తదితరులు పాల్గొన్నారు. తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

నల్లకుంట/గోల్నాక, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదించిన రూ. 11 కోట్లు మంజూరు చేయాలని జలమండలి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్-1 విజయరావుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. గురువారం జలమండలి అధికారిని కలిసి అభివృద్ధి పనుల ప్రతిపాదనల నివేదికను అందజేశారు.

రొయ్యూరు శేషసాయికి జాతీయ ఎక్సలెన్స్ అవార్డు


శేషసాయికి అవార్డు అందజేస్తున్న బండారు దత్తాత్రేయ

రాంనగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రవాస భారతీయ సాంస్కృతిక వేదిక ద్వారా దేశ విదేశాలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల కోసం కృషి చేసినందుకు ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు రొయ్యూరు శేషసాయికి ఫిలాంత్రోపిక్ సొసైటీ ప్రతియేటా ఇచ్చే జాతీయ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. అవార్డును గురువారం రాంనగర్‌లో హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు కృషి చేస్తున్న శేషసాయి సేవలను ప్రశంసించారు. శేషసాయి మాట్లాడుతూ.. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

ప్రేమ్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

అంబర్‌పేట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈశ్వర్, పులి నారాయణ, దిలీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో బస్సు అద్దం ధ్వంసం

అంబర్‌పేట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు అద్దాలు పగలగొట్టిన సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తావద్ద రామంతాపూర్ వైపు వెళ్తున్న బస్‌లో రిజ్వాన్ అనే వ్యక్తి ఎక్కాడు. అప్పటికే అతడు మద్యం తాగి ఉన్నాడు. బస్సు వెళ్తుండగా రిజ్వాన్ చేతిలో ఉన్న ఫోన్ కిందపడి పగిలిపోయింది. కోపోద్రిక్తుడైన అతడు రాయితో బస్సు అద్దం పగులగొట్టాడు. అడ్డుకున్న కండక్టర్‌పై దాడి చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బస్సు కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల అనుబంధ కులాల సమాఖ్య నాయకులు

కవాడిగూడ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధమని, వర్గీకరణతో దళితుల్లోని ఐక్యతను దెబ్బతీసేందుకు రాజకీయ పార్టీలు కుట్రలు పన్నుతునాయని మాల అనుబంధ కులాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎం. దయానంద్ ఆరోపించారు. వర్గీకరణకు మద్దతుగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించి దళితులందరికీ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల అనుబంధ కులాల సమాఖ్య ఆధ్వర్యంలో 'ఎస్సీ వర్గీకరణ వద్దు రాజ్యాధికారమే ముద్దు, జీవో 29ను రద్దు చేసి జీవో 55ను పునరుద్ధరించాలి' నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దళితుల మీద ప్రేమ ఉంటే.. దళిత జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచి వారి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎస్సీలకు క్రీమీలేయర్‌ను వర్తింప చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు, కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర నాయకులు మన్నె శ్రీధర్ రావు, మంత్రి చంద్రశేఖర్, మంగమ్మ, నర్సింగ్‌రావు, కాశీరావు, మూల కేశవులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు కులం, మతం ఉండదు


క్రీడాకారులను సన్మానించిన సుమన్, అలందార్ హుస్సేన్

ముషీరాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కులం, మతం ఉండదని అందరూ ఐక్యంగా క్రీడల్లో పాల్గొంటూ దేశ ప్రతిష్ఠను మరింత పెంపొందించాలని ప్రముఖ హీరో సుమన్ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని అందారా హాల్‌లో పారాత్రోబాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి రాంచీలో జరిగే 3వ పారా నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సయ్యద్ అలందార్ హుస్సేన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుమన్ మాట్లాడుతూ.. దివ్యాంగులు రాష్ట్ర తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. వారికి తమవంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. అలందార్ హుస్సేన్ మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే వారికి టీషర్టులు, కావల్సిన సదుపాయాలను కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో పారా త్రోబాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబు, ముఖ్యసలహాదారుడు సంజీవయ్య, ప్రముఖ కోచ్‌లు లక్ష్మీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.